# రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం!

పెద్దారవీడు: వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు రోడ్లపై అక్కడక్కడా ఉన్న చిన్నపాటి గుంతలను కూడా భూతద్దంలో ఫోకస్ చేస్తూ టీడీపీ నాయకులతో పాటు ఎల్లో మీడియా సైతం పనిగట్టుకుని దుష్ప్రచారం చేసేది. మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చిన వాటి గురించి ఎన్నడూ ప్రస్తావించిన పాపానపోలేదు. గుంతలకు మరమ్మతులు కూడా చేయడం లేదంటూ అభాండాలు మోపేవారు. పథకాలకే నిధులు కేటాయిస్తుడటంతో ఈ దుస్థితి అంటూ టీడీపీ నాయకులకు ఎల్లో మీడియా బాకా ఊదేది. అధికారంలోకి రావడమే పరమావధిగా అప్పట్లో రోడ్లను కూడా టార్గెట్ చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు ఆరు నెలలైంది. ఎక్కడి రోడ్లు అక్కడే..ఎక్కడి గుంతలు అక్కడే అన్న చందంగా ఉంటోంది. కూటమి పాలనలో ఈ దుస్థితికి చేరిన రోడ్లకు తట్ట కాదు కదా.. స్పూను మట్టి కూడా వేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. మండలంలోని చట్లమిట్ల అడ్డ రోడ్డు నుంచి గంగుపల్లి గ్రామానికి వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ఉండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. చట్లమిట్ల అడ్డ రోడ్డు నుంచి పోతంపల్లి, రేగమానిపల్లె, గంగుపల్లి గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనం, ఆటోలు ప్రయాణించేందుకు ఫీట్లు చేయాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు. అంతే కాకుండా చిన్నపాటి వర్షం కురిసినప్పుడు ద్విచక్ర వాహనచోదకులు రోడ్ల మీద గుంతనో నీరు నిల్వనో తెలియక అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. చట్లమిట్ల, పోతంపల్లి, రేగుమానిపల్లి, గంగుపల్లి గ్రామాల మధ్యలో లెక్కలేనన్ని గుంతలు పడ్డాయి. ఈ రోడ్డులో ఇరువైపులా చిల్లకంప రోడ్డుపైకి మూసుకుని ఉండటంతో రాకపోకలకు వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో తారు, కంకర రాళ్లు లేచి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. రహదారిలో అడుగు అడుగుకు గుంతలు ఉండటంతో గుంతల్లో ఆటో చక్రాలు దిగినప్పుడల్లా దాని కుదుపులకు ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడుతూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో బాలింతలు, గర్భిణులు ఆటోల్లో వైద్యశాలలకు వెళ్లాలంటే నరకంగా ఉందని, గత్యంతరం లేని పరిస్థితిలో ప్రయాణం చేస్తున్నామని మహిళలు వాపోతున్నారు. ఈ గ్రామాల ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే చట్లమిట్ల అడ్డరోడ్డు వరకు ప్రజలు వచ్చి మార్కాపురం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం, తదితర గ్రామాలకు వెళ్తుంటారు. ప్రత్యామ్నాయంగా వేరే రహదారి లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఈ రహదారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. కూటమి నాయకులు, మండల అధికారులకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేసి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలి ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


చట్లమిట్ల అడ్డ రోడ్డు వద్ద లేచిన కంకర

**ప్రయాణం నరకం:**



గ్రామాలకు వాహనాల్లో ప్రయాణించాలంటే నరకంగా మారింది. తారు లేచి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక పోవడంతో ద్విచక్ర వాహనచోదుకులు కిందపడి ప్రమాదానికి గురవుతున్నారు. మూల మలుపుల వద్ద చిల్లకంప మూసుకుని ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించడం లేదు. ఈ రహదారిలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– రామాంజనేయరెడ్డి, రేగుమానిపల్లి సర్పంచ్


పోతంపల్లి సమీపంలో రోడ్డు ఇలా..


రేగుమానిపల్లె వెళ్లే రోడ్డులో చిల్లకంప

## క్లుప్తంగా

### నేడు మండల సర్వసభ్య సమావేశం

కురిచేడు: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సతీష్‌బాబు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలని కోరారు. మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీ, సర్పంచ్‌లు హాజరు కావాలని ఆయన కోరారు.

### వర్షాల నుంచి ధాన్యం కాపాడుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

దర్శి: వర్షాల నుంచి వరి ధాన్యం తడవకుండా కాపాడుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని బొట్లపాలెంలో పంట కొనుగోలు కేంద్రాలను ఆయన గురువారం సందర్శించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట కోతలు నిర్వహిస్తున్న రైతులు ధాన్యాన్ని జాగ్రత్తగా వర్షాల బారి నుంచి కాపాడుకునేందుకు అధికారులు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. టార్పాలిన్ పట్టలు సేకరించి ఉంచుకోవాలని రైతులకు సూచించారు. వాతావరణ మార్పులకు తగ్గట్లుగా పంట కోతలు నిర్వహించుకోవాలని సూచించారు. పౌరసరఫరాల సంస్థ డీఎం జి.వరలక్ష్మి, టీపీడీ.వైష్ణవి, ప్రియాంక, వ్యవసాయాధికారి బాలకృష్ణనాయక్, గ్రామ సహాయకులు షేక్ మసుం, బాజీ పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

కురిచేడు: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దర్శి ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు కోరారు. స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో గురువారం మత్తు పదార్థాలతో కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మత్తు పదార్థాలతో కలిగే అనర్థాల గురించి అవగాహన కలిగి ఉండి వాటి బారిన పడకుండా ఉండాలని, తద్వారా సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మత్తు పదార్థాలు లేని సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల్లోని రకాలు, అవి మానవ కేంద్ర నాడీ వ్యవస్థపై ఏ విధంగా ప్రభావితం చేస్తాయనే విషయాలు వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు అవగాహన కోసం వీడియోను ప్లే చేసి చూపించారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు హెల్డానైటింగేల్, విద్యార్థులు పాల్గొన్నారు.

### సందడిగా ఐక్య క్రిస్మస్ వేడుకలు


దొనకొండలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

దొనకొండ: స్థానిక ఏబీఎం చర్చి ప్రాంగణంలో పాస్టర్ డి.ప్రభుదాసు అధ్యక్షతన బుధవారం రాత్రి ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌సీఎం, సీఎస్ఐ, లూథరన్, బెరాకా, కల్వరి, బెతస్త తదితర ప్రముఖ చర్చిల నుంచి సేవకులు, సంఘస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా దైవ సేవకులు క్రిస్మస్ సందేశం వినిపించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రభుదాసు మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని ప్రపంచ దేశాల్లో ఘనంగా నిర్వహించుకుంటారని గుర్తు చేశారు. అనంతరం క్రిస్మస్ కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు పుట్టుకపై నృత్యాలు, పాటలు పాడి అలరించారు. యువత సన్మార్గంలో నడవాలని, దేవుడు చెప్పిన ఆజ్ఞలను పాటించాలని కోరారు. ఏబీఎం చర్చి ప్రెసిడెంట్ సుధాకర్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి కిరణ్‌బాబు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

### గృహ హింసపై అవగాహన

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గృహ హింసపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం సీసీఈ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సావిత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గృహహింస చట్టం 2007వ సంవత్సరంలో అమల్లోకి వచ్చిందన్నారు. స్త్రీ పురుష సంబంధాల్లో అసమానతలు ఏర్పడి గృహహింసకు దారి తీస్తాయన్నారు. విద్యార్థులకు వారం రోజుల పాటు గృహహింస గురించి ఓరియంటేషన్, డిబేట్, రంగోలి, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. అధ్యాపకులు విజయ్‌బాబు, రమేష్, శ్రీనివాసాచార్యులు, అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎంఈఓ అవినీతిపై విచారణ జరపాలి

● యూటీఎఫ్ డిమాండ్


విలేకరులతో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

కురిచేడు: మండల విద్యాశాఖాధికారి-2 అవినీతిపై గుంటూరు ఆర్జేడీ, ఒంగోలు డీఈఓలు వెంటనే విచారణ జరిపి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి సీనియర్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి టి.రాజశేఖర్, మండల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌వలి, అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షుడు డి.జాన్‌బాబు, కె.హిల్డానైటింగేల్, కోశాధికారి కె.పూర్ణచంద్రరావు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ కె.రామకృష్ణలు సంయుక్తంగా కోరారు. విద్యాభివృద్ధికి సహకరించాలని, నూతనంగా ప్రభుత్వం ఎంఈఓ- 2 ఏర్పాటు చేసిందని, ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ సుబ్బారావు కేవలం డబ్బు వసూళ్లకు మాత్రమే తాను ఉంది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలలకు పుస్తకాల పంపిణీకి ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బులు ప్రధానోపాధ్యాయులకు ఇవ్వకుండా సుమారు రూ.97 వేలకు లెక్కలు చెప్పడం లేదన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా లక్షలాది రూపాయలు విడుదలయ్యాయని, వాటిని ఇష్టానుసారం దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. మూడు పాఠశాలలకు సంబంధించిన నిధులు డ్రాచేసి కమిషన్ వసూలు చేసుకున్నారని పేర్కొన్నారు. పాఠశాలల తనిఖీకి వెళ్తే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రూ.3 నుంచి రూ.5 వేల వరకు సమర్పించుకోవాల్సి వస్తోందని మండిపడ్డారు. ఆర్థిక వ్యవహారాల నిర్వహణ ఎంఈఓ-1 చేయాల్సి ఉన్నా స్థానికుడైన సుబ్బారావు అన్నీ తానే అని అటెండెన్స్ రిజిస్టర్ కూడా తన దగ్గరే పెట్టుకుని ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయానికి వచ్చి వెళ్తుటారని తెలిపారు. ఈ నెల 7వ తేదీన జరిగిన మెగా పేరెంట్స్ మీటింగుల నిర్వహణకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన నగదులో కూడా అవినీతికి పాల్పడ్డాడని, అవినీతి ఏ స్థాయిలో ఉందో ఈ సంఘటనలను బట్టి అర్థమవుతోందని తెలిపారు. ఎంఈఓపై అనేక అభియోగాలతో ఆర్జేడీ, డీఈఓలకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

## హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన


హెల్మెట్‌లు ధరించి ర్యాలీ చేస్తున్న పోలీసు సిబ్బంది

పుల్లలచెరువు: మండల కేంద్రంలో హెల్మెట్ వాడకంపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించినట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మీరు బాగుంటేనే మీ కుటుంబం బాగుంటుందనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. వివిధ రోడ్డు ప్రమాదాల్లో కుటుంబాన్ని పోషించే పెద్ద చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి తలెత్తుతుందని చెప్పారు. మీపై ఆధారపడిన వారి కోసమైనా హెల్మెట్ ధరించాలని, నిదానంగా ప్రయాణించి జీవితాన్ని ఆనందమయంగా చేసుకోవాలని కోరారు. ముందుగా పోలీసు సిబ్బంది హెల్మెట్ ధరించి గ్రామ పురువీధుల్లో ర్యాలీ చేశారు. పలువురితో హెల్మెట్ ధరింపజేసి వాహనాలు నడిపించారు.

పెద్దారవీడు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని దేవరాజుగట్టు, హనుమాన్‌జంక్షన్ కుంటలో గురువారం ద్విచక్ర వాహనదారులతో కలిసి పోలీసులు హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించక పోవడంతో రోడ్డు ప్రమాదానికి గురై ప్రతి ఏడాది కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరిస్తే కొంత వరకు ప్రమాదాలు నివారించవచ్చని, హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడిపిన వారికి జరిమాన విధిస్తామని, మూడు నెలలోపు విధించిన జరిమానా చెల్లించని పక్షంలో వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జేసీ గోపాలకృష్ణ


పెద్దారవీడు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్


దొనకొండ: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

దర్శి: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జేసీ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని దేవవరంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన గురువారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో, ఎస్సీ కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీకాలనీలో నూతనంగా పింఛన్‌లు ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. ఆంజనేయస్వామి దేవస్థానం భూములకు హద్దు రాళ్లు వేయాలని గ్రామస్తుల కోరిక మేరకు ఆయన స్వయంగా పాల్గొని వెంటనే కొలతలతో హద్దు రాళ్లు వేయించారు. దీంతో తక్షణ పరిష్కారం చూపిన జేసీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో భూసమస్యలు, ప్రధాన సమస్యలు అర్జీల ద్వారా స్వీకరించారు. మొత్తం 13 అర్జీలు రాగా 5 తక్షణ పరిష్కరించారు. గ్రామంలో అంగన్‌వాడీ పాఠశాలను పరిశీలించి చిన్నారులతో మాట్లాడారు. వారికి అందుతున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ దేవస్థానం భూములకు కౌలు సక్రమంగా చెల్లించాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకాలు వంటి సమస్యలు తహసీల్దార్ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా వారిని ఇబ్బందులు లేకుండా పనులు చేయాలని సూచించారు. ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెద్దారవీడు: గ్రామ రెవెన్యూ సదస్సుల్లో భూముల సమస్యలకు సంబంధించిన సరైన రికార్డులను అందించి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శైలేంద్రకుమార్ సూచించారు. మండల పరిధిలోని చట్లమిట్ల ఎంపీపీ పాఠశాలలో గురువారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ వివాదాలు, సరిహద్దులు, మ్యూటేషన్, ఆక్రమణలు తదితర సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రైతులు పూర్తి స్థాయిలో భూ రికార్డులతో ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. 21వ తేదీన తంగిరాలపల్లి గ్రామం ఎంపీపీ పాఠశాలలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్ఐ గోపి, మండల సర్వేయర్ రామగోపాలరెడ్డి, వీఆర్వో సీహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

దొనకొండ: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. మండలంలోని చందవరం పంచాయతీ పరిధి దేశిరెడ్డిపల్లి, బట్టిపాడు గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 58 అర్జీలు వచ్చాయి. తమ సిబ్బందితో పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, వీఆర్‌ఓ అర్లయ్య, లైసెన్స్ సర్వేయర్ సీహెచ్ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లలచెరువు: గ్రామాల్లోని భూ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ బాలకిషోర్ తెలిపారు. గురువారం మండలంలోని మర్రివేములలో రెవెన్యూ గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామసభలో వివిధ సమస్యలపై 19 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### వైభవంగా నగర సంకీర్తన


నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

పుల్లలచెరువు: ధనుర్మాసం సందర్భంగా పుల్లలచెరువు గ్రామ పుర వీధుల్లో భక్తులు గురువారం వేకువ జామునే నగర సంకీర్తన నిర్వహించారు. వేకువ జామునే స్నానాలు ఆచరించి భక్తితో స్వామి వారిని దర్శించుకుని భక్తి గీతాలు పాడుకుంటూ నగర సంకీర్తన చేశారు.

## అంబేడ్కర్‌కు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి


దొనకొండలో ధర్నా చేస్తున్న నాయకులు

దొనకొండ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అవహేళన చేస్తూ మాట్లాడిన మాటలను, వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని స్థానిక మూడు రోడ్ల కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ నాయకులు గురువారం ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదని, భారత రాజ్యాంగ నిర్మాత దేశానికి దిశా నిర్దేశం చేసిన మహనీయుడని, అంబేడ్కర్ పేరున ప్రస్తావించేందుకు ఎంతో గౌరవంగా భావిస్తారని తెలిపారు. కోట్ల మంది దళితులు, అణగారిన వర్గాలకు మైనార్టీ ప్రజల ఆత్మగౌరవానికి ఆయన ప్రతీక అన్నారు. వెంటనే కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌కు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని అంజయ్య డిమాండ్ చేశారు. ఎం.సంతోష్, కుందుర్తి చిన్న నరసింహులు, జె.కోటేశ్వరరావు, తిరుపతయ్య, సుధాకర్, చిన్న రోశయ్య, వెంకటేశ్వరరెడ్డి, చిరుపల్లి నాగార్జున పాల్గొన్నారు.

## 600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


సారాబట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లగుంట్ల పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై పోలీస్ అధికారులు గురువారం విస్తృత దాడులు నిర్వహించి నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని నల్లగుంట్ల పరిసర ప్రాంతాల సమీపంలో నాటుసారా తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో సిబ్బందితో పాటు స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ గోపాలకృష్ణ పాల్గొన్నట్లు ఎస్సై తెలిపారు.

## స్టార్ రేటింగ్ ఎక్కువ ఉన్న పరికరాలు వాడాలి


ర్యాలీ ప్రారంభిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

దర్శి: స్టార్ రేటింగ్ ఎక్కువ ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు వాడి విద్యుత్ ఆదా చేయాలని ఆ శాఖ ఈఈ శ్రీనివాసరావు సూచించారు. విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో విద్యార్థులతో విద్యుత్ పొదుపుపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ అనంతరం గడియారం స్తంభం సెంటర్‌లో ప్లకార్డులతో మానవహారంగా ఏర్పడ్డారు. విద్యుత్ ఆదా చేయడంపై అవగాహన కల్పించారు. ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ అవసరం లేనప్పుడు ఫ్యాన్‌లు, లైట్‌లు నిలిపివేసుకోవాలన్నారు. విద్యుత్ వినియోగం తక్కువ తీసుకునే పరికరాలు వాడుకుంటే విద్యుత్ ఆదా అవడమే కాకుండా విద్యుత్ బిల్లులు కూడా తక్కువ వస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ ఆదా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏడీలు కృష్ణారెడ్డి, మోహన్‌రావు, హరిబాబు, ఏఈలు వేణుగోపాల్, అంకబాబు పాల్గొన్నారు.

### సాయిబాబా మందిరంలో పూజలు


ప్రత్యేక అలంకారంలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం ప్రత్యేక హారతులు ఇచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే కాలినడక భక్తులకు మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు.

**టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన**

ఆర్.సి.నెం. 92/సి/2024 తేదీ : 16-12-2024

ప్రకాశం జిల్లా, ముండ్లమూరు మండలము - ఉమామహేశ్వరపురం గ్రామపంచాయతీ చెరువుల నందు 2024- 2025, 2025-2026 మరియు 2026-2027 సంవత్సరములకు అనగా మూడు సంవత్సరముల కాలమునకు తేది. 30-06-2027 వరకు చేపలు వేసి పెంచి పట్టుకొను హక్కులు పొందుటకుగాను టెండర్ కం బహిరంగ వేలం తేది 27-12-2024న ఉమామహేశ్వరపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ వేలం జరుపబడును.

షరతులు:

1. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అదే రోజు రూ. 1000/- చెల్లించి ఉదయం 9 గంటల నుంచి 11 గంటల లోపు టెండరు ఫారం పొందవలెను.
2. పూర్తి చేసిన టెండరు షెడ్యూల్ ఫారం అదే రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే స్వీకరించబడును.
3. బహిరంగ వేలం ధరావత్తు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల లోపు మాత్రమే స్వీకరించబడును. మధ్యాహ్నం 2 గంటల నుండి బహిరంగ వేలం జరుపబడును.
4. సీల్డ్ టెండరుకు షెడ్యూల్ ఫారంతో పాటు ఉమామహేశ్వరపురం చెరువునకు రూ.3,80,000/- లు ఏదైనా బ్యాంక్ నుండి పంచాయితీ కార్యదర్శి, గ్రామ పంచాయితీ ఉమామహేశ్వరపురం గ్రామపంచాయతీ పేరున డి.డి. తీసి జతపరచవలెను.
5. బహిరంగవేలంలో పాల్గొనేవారు ధరావత్తు కింద ఉమామహేశ్వరపురం చెరువునకు రూ.3,80,000/-లు ముందుగా నగదు రూపంలో చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెను.
6. టెండర్ కం బహిరంగవేలంలో పాల్గొనేవారు ఉమామహేశ్వరపురం చెరువునకు రూ.5,00,000/-లు, సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించవలెను.
7. గ్రామ పంచాయతీకి బకాయిలు ఉన్న వారు వేలంలో పాల్గొనుటకు అనర్హులు.
8. ప్రభుత్వ మద్దతు ధర ఉమామహేశ్వరపురం చెరువునకు రూ.15,25,000/-లు. రాని ఎడల టెండర్ కం బహిరంగ వేలం పాటను వాయిదా వేయుటకు మరియు రద్దు చేయుటకు గ్రామ పంచాయతీకి పూర్తి అధికారం కలదు.
9. టెండరులో కాని బహిరంగ వేలంలో కాని ఏది హెచ్చు మొత్తం అయినదో దానిని మాత్రమే స్వీకరించబడును.
10. ఉమామహేశ్వరపురం చెరువు సర్వే నెంబరు 207లో య.83.92 సెంట్లు విస్తీర్ణం
11. టెండరు షరతులు మిగతా వివరములు గ్రామ పంచాయితీ కార్యాలయం పనిచేయు వేళలలో వచ్చి తెలుసుకొనవలెను.
12. చెరువులకు గాని, అలుగులకు గాని ఎటువంటి నష్టం కలిగించరాదు.

శ్రీమతి వేముల పద్మావతి, సర్పంచ్. ఉమామహేశ్వరపురం అగ్రహారం ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా.

పొణ్యం మౌలాలి, పంచాయితీ కార్యదర్శి, అగ్రహారం, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా. సెల్ : 9603612141

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com